www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 27 నవంబర్ 2024



సైలెంట్‌గా 'స్మార్ట్ మీటర్లు'

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలి: సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు


మీటర్లు బిగిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్ళుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాప కింద నీరు లాగా చిత్తూరు జిల్లాలో కూడా మొదటి దశలో వ్యాపారస్తుల కోసమని పేరు చెప్పి మెల్లమెల్లగా రైతులకు సామాన్య ప్రజలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, జిల్లాలో ప్రజలు ఎక్కడకక్కడ వాటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లాలో బంగారుపాళ్యం ఇతర అన్ని ప్రాంతాల్లోనూ స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పలు జిల్లాలలో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని తెలిపారు. నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం కొనసాగిస్తున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని, ఆ నేతలు మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చారు.

ఆదాని, షిర్డీ సాయి సంస్థలతో కుమ్మక్కయ్యి, వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని నాడు ఆరోపించారని, కానీ నేడు కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్ మీటర్ పెట్టడం నమ్మకద్రోహమే అని విమర్శించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతోందని, ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలన్నారు. బ్యాలెన్స్ పూర్తి కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, పేదలకు అంధకారమే మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుండే వసూలు చేస్తారని, మరోవైపు విద్యుత్ అధికంగా వినియోగించే రాత్రి వేళల్లో అధిక రేట్లు వసూలు చేయటం నడ్డి విరిచే భారమన్నారు. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఎసరపెట్టేందుకే పంపు సెట్లకు మీటర్లు బిగిస్తున్నారని, ఏ భారం ఉండదని పైకి చెప్తున్నా ప్రయివేటు విద్యుత్ ఉత్పత్తిదారులకు దోచిపెడుతూ, ప్రజలపై భారాలు వేసేందుకు, ఉచిత విద్యుత్‌ను దశలవారీగా తొలగించడానికి ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకువచ్చారని అన్నారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాడు వైసిపి, నేడు తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ మీటర్లను కొనసాగించడం గర్హనీయమన్నారు. ఇప్పటికే 17వేల కోట్ల రూపాయలు ట్రూ ఆఫ్ చార్జీల భారం వేస్తున్నారని, మరోవైపు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించటం తగదన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అఫ్ చార్జీల అంశంపై వైసిపి దారిలోనే తెలుగుదేశం ప్రభుత్వం ప్రయాణిస్తున్నదని, ఈ అంశాలపై ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని, ట్రూ ఆప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లపై ఎక్కడికక్కడ ప్రజలు సమైక్యమై ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులను నిలదీయాలని అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా

కలెక్టరేట్ ఎదుట ధర్నా

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం.. కార్మిక, రైతు సంఘాల నాయకుల పిలుపు


ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ విధానాల్లో మార్పు లేదని స్పష్టంగా ప్రకటించింది. కానీ కుక్క తోక వంకర అన్న చందంగా మోదీ ప్రభుత్వం మరోసారి రుజువు చేసుకుంది. ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ, జనసేన ప్రభుత్వాలు రాష్ట్రంలోనూ అవే విధానాలను అమలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా చిత్తూరు కలెక్టరేట్ ఎదుట మంగళవారం సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీగా శంఖారావాన్ని పూరించారు. మొదట సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు రాజ్యాంగ ప్రతిమను చదవి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేంద్రన్, ఏఐటియుసి దాసరి చంద్ర, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ సంపదను సృష్టించే కార్మిక వర్గం, దేశానికి అన్నం పెట్టే రైతాంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని అన్నారు. కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని పార్లమెంట్ సాక్షిగా చెబుతోందని, రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మ శాస్త్రాన్ని ప్రవేశపెడతామని చెప్తున్న మతోన్మాద బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కార్మికులకు నెలకు ఇవ్వాల్సిన రూ.26వేలు కనీస వేతనాలు ఇవ్వకుండా గత పది సంవత్సరాల నుంచి ఏమాత్రం వేతనాలు పెంచకపోవడం దుర్మార్గమన్నారు. ధరలు రెట్టింపుగా పెరుగుతున్నా, సుప్రీంకోర్టు చెప్పిన స్కీం కార్మికులు, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికులను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎంతకాలం పనిచేసిన పర్మినెంట్ చేయకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సమస్యల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, దుర్మార్గమైన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే స్కీం వర్కర్లకు పెన్షన్, గ్రాడ్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, రైతుల ఉత్పత్తులకు ఉత్పత్తి ఖర్చు కుటుంబ శ్రమ విలువతో పాటు మరో 50శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో కార్మికులైన భవన, హమాలీ, ఆటో, రవాణా రంగం తదితర సామాజిక సంక్షేమం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధిక ధరలు తగ్గించి ప్రజలపై భారం పడకుండా చూడాలని, అవినీతిని పెంచి పోషిస్తూ దేశ సంపదను కొల్లగొడుతున్న ఆదానిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకోవడానికి కార్మికులు రైతాంగం ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, జ్యోతి, వరలక్ష్మి, గంగ, వ్యవకాసం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, ఏఐటియుసి నాయకులు రమాదేవి, ప్రభావతి, జయకుమారి, ఐఎఫ్‌టియు నాయకులు సుబ్రమణ్యం, రైతు సంఘం నాయకులు దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

'యువ ఉత్సవ్' ప్రతిభకు చక్కని వేదిక


యువజన ఉత్సవ ప్రారంభ సభలో మాట్లాడుతున్న నగర మేయర్ అముద

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: యువ ఉత్సవ్ వంటి కార్యక్రమాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉండడంతోపాటు వారిలోని ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు, దేశభక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయని చిత్తూరు నగర మేయర్ అముద అన్నారు. యువతరం సానుకూల దృక్పథంతో ఈ పోటీ ప్రపంచంలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ,నెహ్రూ యువ కేంద్ర, చిత్తూరు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ యువ ఉత్సవ్‌లో వచ్చిన అవకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉరకలెత్తే ఉత్సాహం చూపించే యువతను చూస్తే తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయన్నారు.

'దేవకీ నందన వాసు దేవా' చాలా బాగుంది..

మాజీ మంత్రి గల్లా అరుణకుమారి



రాఘవ థియేటర్ ఎదుట టిడిపి నాయకుల సందడి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సనాతన ధర్మం, మాతృ ప్రేమను తెలియజేసే విధంగా దేవకీ నందన వాసుదేవ చిత్రంను నిర్మించడం జరిగిందని, చిత్రం చాలా బాగుందని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తెలిపారు. చిత్తూరు రాఘవ థియేటర్లో ప్రదర్శింపబడుతున్న తన మనవడు గల్లా అశోక్ నటించిన దేవకీ నందన వాసుదేవ చిత్రాన్ని అరుణకుమారి, టిడిపి నాయకులతో కలిసి మంగళవారం తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సనాతన ధర్మాన్ని.. మాతృ ప్రేమను మరింతగా పెంపొందించే విధంగా చిత్రాన్ని తీయడం జరిగిందన్నారు. ఈ చిత్రంలో తల్లి ప్రేమతో పాటు హాస్యం, వినోదం, సంగీతం, ఫైట్స్, ఇతర సన్నివేశలను బాగా తీయడం జరిగిందన్నారు. తాను ఇప్పటికే రెండుసార్లు చూడడం జరిగిందని ఈ చిత్రం అందర్నీ ఆకట్టుకుంటున్నదని పేర్కొన్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు సైతం చూడదగిన కుటుంబ కథాచిత్రమని తెలిపారు. సినిమా విజయవంతంగా ప్రదర్శిస్తుండడంతో సినిమా థియేటర్ వద్ద భారీ కేక్‌ను కట్ చేసి టిడిపి నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు పంచిపెట్టారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, చిట్టిబాబు, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

నియోజకవర్గ స్థాయిలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు ఆర్డీవో వై.భవానీ శంకరి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరి మండలం గ్రుంండాజుకుప్పం దళితవాడలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు, బుగ్గఅగ్రహారంలో హెల్పర్ పోస్టుకు, నింద్ర మండలం శ్రీరామాపురంలో మినీ కార్యకర్త పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 3 పోస్టులకు గాను ఐదు మంది హాజరయ్యారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి కె.హైమావతి, నగరి అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యులు ఎయిల్ అరసన్, సీడీపీవోలు కృష్ణవేణి, ఇ.జయంతి, ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు కరుణాకర్‌రెడ్డి, సుకన్య, శ్రీహరి పాల్గొన్నారు.





దూసుకొస్తున్న తుపాన్

- జిల్లాలో ముసురు వానలు
- అప్రమత్తమైన అధికారులు
- పెరిగిన చలితో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తుపాన్... తుపాన్... ఈనెల మొదటివారంలో బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం తుపానుగా మారి రాష్ట్రంపై ప్రభావం చూపనున్నదని హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయినప్పటికీ అది జిల్లాపై పెద్దగా ప్రభావం లేకుండాపోయింది. అయితే తాజా తుపాన్ హెచ్చరికలతో మూడు రోజులపాటు జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మంగళవారం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుతో ఆకాశం మేఘావృతమై ముసురు కమ్ముకుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిసాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, కలరా వ్యాపించే అవకాశాలున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉంటూ ప్రజాఆరోగ్యంపై దృష్టి సారించాలి. అలాగే వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ ఉద్యానశాఖ, జల వనరులశాఖ అప్రమత్తంగా ఉంటూ చెరువులు, ప్రాజెక్టులు రిజర్వాయర్ల సంరక్షణతో పాటు పంట నష్టం ఆస్తి నష్టం చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. నగరపాలికా పురపాలిక సంస్థలు పారిశుద్ధ్యం కోసం మెరుగైన చర్యలు చేపట్టాలి.

బంగాళాఖాతంలోని వాయుగుండం తుపాన్‌గా మారి బుధవారం సాయంత్రం నుంచి జిల్లాలో వర్షాలు మొదలయ్యాయి. ప్రస్తుతం శ్రీలంక తీరం దగ్గరలో ఉన్న ఫెంగల్ తుపాన్ అత్యంత వేగంగా భారతదేశం వైపు దూసుకొస్తుంది. ఈ తుపాన్ తమిళనాడు రాష్ట్రంలో ఈనెల 29వ తేదీన తీరం దాటనున్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈక్రమంలో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. తుపాన్ ఫెంగల్ ప్రభావంతో ఈనెల 30వ తేదీ వరకు తమిళనాడులో భారీ వర్షాలు పడనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాలు అయిన నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడనున్నాయి. కొన్ని చోట్ల తేలికపాటి వానలు పడనున్నాయి. రైతులు అందరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కోతలు ఉంటే వెంటనే పనులు చేసుకోవాలని, కల్లాల్లోని పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. తుపాన్ 29న తీరం దాటనున్న నేపథ్యంలో రాష్ట్రాల్లోని మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తీరం వెంట 50 నుంచి 85 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ముసురు వానతో పెరిగిన చలి

ఇబ్బంది పడ్డ వృద్ధులు, పిల్లలు.

సోమల: తుపాను ప్రభావం కారణంగా మండలంలో మంగళవారం ఉదయం నుంచి అప్పుడప్పుడు ముసురు వానతోపాటు ఈదురు గాలులకు చలి తీవ్రత పెరిగింది. దీంతో వృద్ధులు పిల్లలు ఇబ్బంది పడ్డారు. తుపాను ప్రభావం కారణంగా ఉదయం నుండి ఎండ లేకుండా వర్షం పడుతూ చలిగాలులు వీస్తూ వచ్చాయి. రోజంతా ఓ మోస్తారు వర్షం కురుస్తూ ఉండడంతో రోజువారీ కూలి పనులకు వెళ్లేవారు కూడా పనులేక ఇంటి వద్ద ఉండాల్సి వచ్చింది. మండలంలో ఇంతవరకు ఏ చెరువు నీటితో నిండుగా లేవు. భారీ వర్షం కురిసి అన్ని చెరువుల్లోకి నీరు రావాలని తద్వారా చెరువు ఆయకట్టు రైతులు తమ పొలాలలో పంటలు పండించేందుకు అవకాశం ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి: తహశీల్దార్ పార్వతి



వి కోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాబోవు మూడు రోజులలో భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణశాఖ హెచ్చరికల మేరకు మండల పరిధిలోని రెవెన్యూ సిబ్బంది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పార్వతి విజ్ఞప్తి చేశారు. చిత్తూరు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ వారు ఆదేశాలు జారీ చేశారని, ఈ మేరకు తహశీల్దార్ పార్వతి రెవెన్యూ అధికారులను, సిబ్బందిని గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని, పాడి పరిశ్రమ రైతులు, పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని ముందస్తుగా సమకూర్చుకోవాలని సూచించారు. తుపాన్ కారణంగా ఏదైనా నష్టం వాటిల్లితే కార్యాలయానికి తక్షణం సమాచారం అందించాలని కోరారు.

నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశం


స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం నగరపాలక కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగింది. మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, కె.నిర్మల, ఆర్.శశికుమార్, ఎస్.సుష్మా, కె.అశోక్ పాల్గొన్నారు. అజెండా అంశాలపై చర్చించి ఆమోదించారు. అజెండా అంశాలైన 9వ వార్డు ఆఫీసర్స్ లైన్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అంచనా రూ.12.80 లక్షలను సాధారణ నిధుల నుంచి వ్యయం చేయడానికి, 7వ వార్డు పరిధిలోని బాపూజీ నగర్ స్ట్రీట్‌లో రూ.14.80 లక్షలు, 9వ వార్డు నలందనగర్‌లో రూ.16.20లక్షలు, మైత్రినగర్లో రూ.26.10 లక్షలను సీసీ రోడ్ల నిర్మాణానికి 2024- 25 సాధారణ నిధుల నుండి వ్యయం చేయడానికి ఆమోదించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కోసం నవంబర్ 2024 నుండి ఫిబ్రవరి 2025 వరకు రూ.39.90లక్షలు వ్యయం చేయుటకు స్టాండింగ్ కమిటీ వారు ఆమోదించారు. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంఈ వెంకటరామి రెడ్డి, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్సీ కంచర్ల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి - రామకుప్పం: మండల అభివృద్ధికి కూటమి నేతలు, కార్యకర్తలు పరస్పర సహకారంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషిచేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కోరారు. మంగళవారం రామకుప్పంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి జన్మదిన వేడుకలకు ఆయన విచ్చేసి ఏర్పాటుచేసిన సభలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మండలాల వారీగా విరివిగా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారన్నారు. పేదరిక నిర్మూలన ధ్యేయంగా మండలంలో పరిశ్రమల ఏర్పాటు, విమానాశ్రయం నిర్మాణం, నిరుద్యోగులకు ఉపాధి, సుబ్రమణ్యస్వామి దేవాలయ అభివృద్ధి, రహదారుల ఏర్పాటు, అనేక సంక్షేమ పథకాలతో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కూటమి నేతలు ఆనంద రెడ్డి జన్మదినం సందర్భంగా భారీ ఎత్తున కేక్ కత్తిరించి, దుశ్శాలవాలు కప్పి, పూలమాలువేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, అంజనేయరెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, సీతాపతి, చిన్ని కృష్ణ చలపతి, గంట్లగౌడు, నందారెడ్డి, సుబ్రీ, విజయ్ రెడ్డి, బాలు, సలాంసాబ్, రఫీ, వెంకటాచలం, వెంకటరమణ, ఆదిల్, మంజునాథ్ పాల్గొన్నారు.



దోమల నియంత్రణ పై శ్రద్ధ పెట్టండి

కమిషనర్ పి. నరసింహ ప్రసాద్


పారిశుధ్య పనులు తనిఖీ చేస్తున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలో దోమల నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. మంగళవారం ఉదయం కమిషనర్ నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. జానకారపల్లి వద్ద నిల్వ నీటిలో దోమలు లార్వాల నియంత్రణకు ఆయిల్ బాల్స్ వేశారు. నగరంలో దోమల నియంత్రణకు అన్ని వార్డుల పరిధిలో ఆయిల్ బాల్స్ వేయడం, స్ప్రేయింగ్ చేయడం విస్తృతంగా చేపట్టాలన్నారు. అన్ని ప్రాంతాల్లో ఒకేసారి నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా దోమల వృద్ధుని నియంత్రించవచ్చని, ఇందుకోసం ప్రతి వార్డు పరిధిలో నిల్వ నీటి ప్రాంతాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేయడం, స్ప్రేయింగ్ చేయడం సత్వరం పూర్తి చేయాలన్నారు. అంతకుముందు కమిషనర్ మిట్టూరు మస్టర్ పాయింట్‌లో పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదు తనిఖీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు నిర్దేశించిన సమయం విధుల్లో ఉండేలా పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పరివేక్షించాలన్నారు. ప్రధాన రహదారులు, చిన్నపాటి వీధులు ఉదయమే శుభ్రం చేయాలని, ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ లోకానాథం పాల్గొన్నారు.

ఫారెస్ట్ రోడ్డు పరిశీలన..

నగర పరిధిలో మెసానిక్ మైదానం నుంచి పీవీకేఎన్ కళాశాల వరకు ఉన్న రోడ్డును కమిషనర్ పంచాయతీ రాజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు రోడ్డు వెడల్పు పనులు చేపట్టడంపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. 3.2 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డును వెడల్పు చేయడం కోసం చేపట్టాల్సిన చర్యలపై పంచాయతీరాజ్ డీఈ కృష్ణ, ఎఈ లోకేష్‌తో మాట్లాడారు.

నేడు మండల మీట్


ఎంపీడీవో సాయి లహరి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో సాయి లహరి తెలిపారు. ఈ నెల 12న నిర్వహించాల్సి ఉండగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న కారణంగా అప్పట్లో వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ సమావేశాన్ని ప్రస్తుతం అత్యవసరంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు. బుధవారం ఉదయం 10:30గంటలకు మండలా భివృద్ధి కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించ నున్నట్లు వివరించారు. ఆయా శాఖల అధికారు లు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

నింగికెగిసిన పాతాళగంగ


గ్రామంలో ఎగసిపడుతున్న నీరు

ప్రజాశక్తి-కుప్పం రూరల్: మండలంలోని చెక్కునత్తం పంచాయతీ ప్రజలు తమ గ్రామంలో పాతాళ గంగ నింగిని అంటిందని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా గ్రామ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నట్టు తెలిపారు. గ్రామస్తుల సమస్య లను స్థానిక టిడిపి నాయకులు, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంల సహకారంతో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడిని గుర్తించిన సీఎం వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి ఆదేశించారని, ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలో బోరు బావి తవ్వించడం జరిగిందన్నారు. ఈ బోరు బావి నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా నీరు రావడంతో గ్రామస్తుల దాహార్తి తీరబోతోందని స్థానిక టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'గోకులం' వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-గుడిపల్లి: మినీ గోకులం షెడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్ రెడ్డి కుమారి లబ్ధిదారులను ఆదేశించారు. మండలంలోని రాళ్ల గంగమ్మ గుడి మీటింగ్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు బాబు నాయుడు మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు మినీ గోకులం పనుల లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. లబ్ధిదారులు ప్రతి ఒక్కరు త్వరితగతిన షెడ్డు నిర్మించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారులు పశుసంవర్ధక సహాయకులు, ఎపివో, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు స్థలం కేటాయించాలి


వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు స్థలం కేటాయించాలని మండలంలోని కంభంపల్లె పంచాయతీ దాసర్ల పల్లె గ్రామస్తులు మంగళవారం తహశీల్దార్‌కు విన్నవించారు. బైరెడ్డిపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం చేరుకుని తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా ఎస్ఐని కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ పంట నమోదు తప్పనిసరి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రైతులు తమ పంటలను తప్పని సరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర సహాయ సంచాలకులు నాగపద్మిణి అన్నారు. మంగళవారం మండలంలోని పాలేరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటలలో సమగ్ర పోషక యాజమాన్యం, సాయిల్ హెల్త్ కార్డు స్కీం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, రబీలో వేసే పంటలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని తద్వారా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చని వివరించారు. మామిడి పంటలో పూత సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పురుగు మందుల వాడకం తదితర విషయాలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిత్తూర్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఉమా, ఉద్యానవన శాఖ అధికారి సాగరిక, వ్యవసాయ విస్తణాధికారి సాధరయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు పుష్పాంజలి, ఆనందరాజ్, రైతులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: రబీలో సాగు చేసే పంటలకు పీఎం ఎఫ్‌బివై క్రింద ఇన్సూరెన్స్ పథకం రైతులకు అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి గీతా కుమారి తెలిపారు. ఇందులో దిగుబడి ఆధారితంగా వరి, వేరుశెనగ పంటలు, వాతావరణ ఆధారితంగా టమోటా పంట ఈ పునర్వ్యవస్థీకరించబడిన బీమా పథకం ద్వారా ఇన్సూరెన్స్ చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


కలెక్టరేట్‌లో


విజయపురంలో


సోమలలో


పూతలపట్టులో


ఎస్ఆర్ పురంలో

ప్రజాశక్తి-కుప్పం టౌన్: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం పట్టణంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జిమ్ దాము, కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: 75వ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా మండలంలోని పూతలపట్టు, రంగంపేట క్రాస్ పి కొత్తకోట, తిప్పనపల్లి, నూతనపల్లి, కొత్తూరు గ్రామాలలో మంగళవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు గజ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంతి డాక్టర్‌లు మునిరత్నం, డాక్టర్ జీవరత్న, సర్పంచ్ మాశిలమని జైపాల్, రామ్మూర్తి, దాము, వెంకటరమణ, నాగరాజా, రాధాకృష్ణ, సుబ్రహ్మణ్యం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, సర్పంచ్ శిల్పా, సుబ్రహ్మణ్యం, ధనంజయులు రెడ్డి, వెంకటేష్, చిన్నబ్బ రెడ్డి, మునికృష్ణ రెడ్డి, మునెయ్య, ధర్మయ్య, పొన్నయ్య, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని ఎంపిడివో కార్యాలయ ఆవరణలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో మోహన మురళి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో కలిసి సిబ్బంది రాజ్యాంగ ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవీంద్రబాబు, ఎంపీపీ సరిత జనార్ధన్, వైసిపి నాయకులు మణి, కుప్పయ్య, బాలాజీ, బాబు, గోవిందయ్య, రామకృష్ణయ్య, జయపాల్, బాబు, ఉమాపతి, గోపి, సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయపురం(నగరి): డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మన భారత రాజ్యాంగ నిర్మాత స్ఫూర్తిగా రాజ్యాంగ ప్రవేశిక ఆమోద దినోత్సవ వేడుకలు విజయపురం సచివాయలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో కెల్లా అత్యున్నత రాజ్యాంగం మన భారత రాజ్యాంగం అని, రాజ్యాంగ స్ఫూర్తిగా ప్రతి ఒకరూ నడుచుకోవాలని, సదరు మార్గదర్శకాల మేరకు అందరూ బాధ్యతగా రాజ్యాంగ స్ఫూర్తిగా నడుచుకోవాలన్నారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేశారు. భారత రాజ్యాంగం భారత ప్రజల జీవనాడి అని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోపి, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు, రాజ్యాంగ ప్రవేశికను సామూహికంగా పఠించారు.

రామకుప్పం: మండలంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మునస్వామి, నారాయణ చారి, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, సీతాపతి, చిన్న కృష్ణ, నందా రెడ్డి, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో రాజ్యాంగ ఆమోద దినోత్సవం జరుపుకుంటున్నామని జేసీ విద్యాదరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాల్‌లో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి పద్మనాభం, సాంఘిక మైనారిటీ గిరిజన సంక్షేమ శాఖల అధికారులు రాజ్యలక్ష్మి, చిన్నారెడ్డి, మూర్తి, డిఎల్‌డివో రవికుమార్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని చిత్తూరు నగరపాలక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి మేయర్ ఎస్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు టౌన్: చిత్తూరు పిఈఎస్ స్కూల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్ పార్లమెంట్ నిర్వహించి అలరించారు. ఈ కార్యక్రమంలో పిఈఎస్ స్కూల్‌తో పాటు మదర్ థెరిసా, అమర్ రాజా, పరమహంస యోగానంద విద్యాలయ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, ప్రిన్సిపాల్ వైవి కృష్ణ బాబు, విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సదుం: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్ఎం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల యుగంధర్ ,శ్రీనివాసులు, అమర్నాథ్, ఉషారాణి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 75వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలను స్థానిక విఆర్ఆర్ కాలనీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో భారతీయ అంబేద్కర్ సేన సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బాస్ నాయుకులు ముల్లంగి కృష్ణయ్య, మంద సీతాపతి, నాగరాజ, రాంబాబు, హరినాధ, నరసింహులు, గంగ రాజు, మదన్ మోహన్, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోమల: 75వ జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నారాయణ ఇతర అన్ని శాఖల అధికారులు ఎంఆర్‌పీఎస్ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి రాజ్యాంగ దినోత్సవ ఆవశ్యకతను గుర్తుతెచ్చుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ గిరిబాబు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు హసీనా, చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో.. నాగిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పలమనేరు రెవెన్యూ డివిజన్ అధికారి, మండల మాల మహానాడు నాయకుడు టిఎం మంజునాథ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి అంజలి ఘటించారు. రాయలపేట ప్రభుత్వ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డప్ప, ఎంపీడీవో బాలాజీ, దళిత సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పటానికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, భాష్యం, తహశీల్దార్ శివయ్య, ఎంపీడీవో ప్రేమ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ కొలేష్, సర్పంచ్ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నిషేధిత లాటరీ టికెట్ స్వాధీనం

- ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-పుంగనూరు: నిషేధిత లాటరీ టికెట్లు 12.80 లక్షలు విలువ చేసే టికెట్‌లు విక్రయి స్తుండగా ముఠా లోని ఇద్దరు సభ్యులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. అర్బన్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం లాటరీ విక్రయ ముఠా అరెస్ట్ వివరాలను వెల్లడించారు. పట్టణంలో నిషేధిత లాటరీ టికెట్ల విక్రయిస్తున్న ముఠాలోని ఇద్దరు సభ్యులని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 12లక్షల 80వేల రూపాయల విలువచేసే నిషేధిత లాటరీ టికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నానబాల వీధికి చెందిన నజీర్ బాషా, హైస్కూల్ వీధికి చెందిన మహమ్మద్ హుస్సేన్ ఆటో డ్రైవర్ కలసి లాటరీ టికెట్ విక్రయిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. నిషేధిత లాటరీ టికెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

నాటు సారా స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-పుంగనూరు: అక్రమంగా నిల్వ ఉంచేందుకు సరఫరా చేస్తున్న నాటు సారాను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు మంగళవారం సిఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఏటిగడ్డ పాల్యంకు నాటు సారా అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఏటిగడ్డపాలెంకు చెందిన రెడ్డప్పకు నల్లగుట్లపల్లి తండాకు చెందిన భాస్కర్ నాయక్ అక్రమంగా 100లీటర్లు నాటు సారాను సరఫరా చేస్తుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగింది. పోలీసులు జరిపిన దాడుల్లో భాస్కర్ నాయక్ పరారీకాగా, రెడ్డెప్పను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు.

ఆర్ఎంపి, పిఎంపిలకు అవగాహన సదస్సు



ప్రజాశక్తి-పలమనేరు: ప్రజలకు ప్రభుత్వాసుపత్రిల్లో అందించే వైద్యమే రక్షణ కవచంగా ఉంటుందని చిత్తూరు జిల్లా వైద్య అధికారులు పేర్కొన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ భవనంలో ఆర్ఎంపి, పిఎంపి వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ జిల్లా వైద్య అధికారి వెంకట ప్రసాద్, జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి హనుమంతరావు మాట్లాడుతూ పలమనేరు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు వారి వారి పరిధిలోనే ప్రథమ చికిత్స చేయాలన్నారు. పరిధి దాటి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యత కలిగిన మందులతో పాటు అధునాతన పరికరాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి: ఎంపిపి

- మండల మీట్‌కు పలువురు గైర్హాజరు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవోకు విజ్ఞప్తి


మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ రెడ్డెప్ప అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు వివిధ సమస్యలపై ఇబ్బంది పడుతున్నారని అధికారులు చొరవ తీసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మండల మీట్‌కు హాజరుకాని అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాడి రైతులకు సంబంధించి మండలంలో 220 మినీ గోకులం షెడ్లు మంజూరైనట్లు వెటర్నరీ డాక్టర్ తెలిపారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ మండలంలో 1351 పూర్తి ఆరు వందల ఇరవై ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని వాటిని మార్చి నాటికి పూర్తి చేసి బిల్లు పొందాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకనాథం మాట్లాడుతూ 139పనులు జేజేఎం గ్రాంట్ ద్వారా మండలానికి మంజూరైనట్లు వివరించారు. తీర్థం ఎంపీటీసీ మాట్లాడుతూ తీర్థం గ్రామంలో పసలమందలో కొన్ని రోజుల క్రితం బోరు వేశారు.. ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు, ప్రస్తుతం అక్కడ నీళ్లు రాలేదని సమావేశంలో ప్రశ్నించారు. ఏఈ లోకనాథం స్పందించి వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ పంటలకు సంబంధించి ప్రభుత్వ మంజూరు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేశవులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు, తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, ఏపీ మోడల్ స్కూల్ కామనపల్లిలో ఉపాధ్యాయులు, పోలీస్ స్టేషన్లో స్థానిక ఎస్ఐ ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాబ్ అంబేద్కర్‌కి అంజలి ఘటించారు. ప్రతిజ్ఞ చేసి రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలి

కమిషనర్ శ్రీనివాసరావు


తనిఖీలు చేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: తినుబండారాల విక్రయదారులు ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కుప్పం పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాస రావు తెలిపారు. ఆయన విధులలో భాగంగా తరచూ హోటళ్లలో, మాంసపు దుకాణాలలో, చాట్ సెంటర్లలో తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలోని నూర్ హోటల్, షణ్ముగం హోటల్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్లాస్టిక్ కవర్లు వాడకాన్ని తగ్గించాలని, ముఖ్యంగా ఇడ్లీలు ఉడికించడానికి ప్లాస్టిక్ కవర్లు వాడరాదని, ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన ఆహార పదార్థాలను వేడి చేసి విక్రయించడం వంటివి చేయరాదని సూచించారు. వ్యాపారులు నాణ్యతలేని తినుబండారాలను విగ్రహించినట్టు తన దృష్టికి వస్తే కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు.

మండలానికి రెండు సబ్ స్టేషన్లు మంజూరు

ప్రజాశక్తి-వి కోట: లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు మండల పరిధిలో రెండు సబ్‌స్టేషన్‌లు మంజూరైనట్లు ఎంసి మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు రంగనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మట్లాడుతూ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి విజ్ఞప్తి మేరకు రెస్కోపరిధిలోని లింగాపురం, అన్నవరం క్రాస్‌లో రెండు సబ్ స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు వివరించారు. ఈ సబ్‌స్టేషన్‌లను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు లో వోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి నియోజకవర్గ పరిధిలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టబోయే సోలార్ విద్యుత్ ప్రతిపాదనలను వీకోట మండలంలోని రెస్కోపరిది పది పంచాయతీలలో అమలు చేయాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ కార్యదర్శి ఈశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జాతీయ కాపు సంఘం జిల్లా అధ్యక్షులుగా విజయబాబు


విజయబాబు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: జాతీయ కాపు సంఘ చిత్తూరు జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులుగా విజయబాబు నియమించామని ఆ సంఘం వ్యవస్థాపకులు, అధ్యక్షులు కర్ణ మురళీకృష్ణ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన విజయబాబు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో కాపు సంఘానికి చేసిన సేవలను గుర్తించి నేడు చిత్తూరు పార్లమెంటరీ కాపు సంఘ అధ్యక్షులుగా నియమించడంపై కరుణ మురళీకృష్ణ నాయుడుకి, ప్రచార కార్యదర్శి గోపి రాయల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా పార్లమెంటరీలో ఉన్న కాపు కాపుల అభివృద్ధికి తన వంతు ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఏ అవసరం వచ్చిన వారికి చేదోడు, వాదోడుగా ఉంటానని కాపులందురు ఐక్యంగా ఉండాలన్నారు.


పారిశుద్ధ్యం మెరుగుపడింది



- ప్రజాశక్తికి స్పందన


ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగరి రూరల్ మండలం వేలావడిలో మంగళవారం అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. మంగళవారం 'వేలావడలో సమస్యల తిష్ట' అనే శీర్షిక ప్రచురణ చేయడం జరిగింది. దీన్నిపై స్పందించిన అధికారులు మురికి నీటి తొలగించి పారిశుధ్యం మెరుగు పరిచారు.

బోదకాలు నిర్మూలనపై అవగాహన



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: జాతీయ బోదకాలు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల పాతపాళ్యం గ్రామంలో పుత్తూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్ బాబు ఆధ్వర్యంలో రాత్రిపూట రక్త పూతల సేకరణ "కార్యక్రమం నిర్వహించారు,. గ్రామంలో 513మందికి రక్తపూతలు సేకరించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి మోహన్ బాబు ప్రజలకు బోదకాలు వ్యాధి దోమకాటు కారణంగా సంక్రమింస్తుందని, పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇప్పటికే ఈ వ్యాధి బారిన పడిన వారు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు గంగాదేవి, ఆరోగ్య కార్యకర్త శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం తనిఖీ


అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చే వినతులు, వాటి పరిష్కరిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని వరత్తూరు గ్రామంలోని గంగమ్మ గుడికి వెళ్లే దారి విషయంగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అభ్యంతర వ్యక్తం చేయడాన్ని గ్రీవెన్స్‌లో అర్జీతో విన్నవించారు. దీంతో ఆయన వరత్తూరు గ్రామంలో గంగమ్మ గుడి దారి తగాదా సమస్యని పరిశీలించారు. కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్, డిటి తులసిరామ్, విఆర్వోలు సుబ్రమణ్యం, ఫాతిమా, సచివాలయం సర్వేయర్ రమణ పాల్గొన్నారు.

అలరించిన మాక్ పార్లమెంట్



ప్రజాశక్తి-విజయపురం(నగరి): మండలంలోని ఎం.కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలోని 9,10వ తరగతి విద్యార్థులు మంగళవారం నిర్వహించిన మాక్ పార్లమెంట్ అందరినీ అలరించింది. పాఠశాలలోని టేబుళ్లకు మంత్రుల శాఖలను అంటించి ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులుగా పార్లమెంట్‌లో ఎయే నిర్ణయాలు తీసుకుంటారో అలా చేసి చూపడం అందరినీ అకట్టుకుంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గీతాకుమార్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు హిమావతి, మునిరత్నం, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెండర్ క్యాంపెయిన్



ప్రజాశక్తి-సదుం: స్థానిక వెలుగు కార్యాలయం ఏపీఎం హరిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం సదుంలో జెండర్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది, సంఘమిత్రలు, ఎస్‌హెచ్‌జి మహిళ సంఘ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలతో సదుం ప్రధాన వీధుల్లో ఆయన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సదుం బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి వరప్రసాద్, ఏపీఎం హరిప్రసాద్, సీసీలు మధుసూదన్ రెడ్డి, భాను కుమార్, సుజాత, సంఘమిత్రలు, అంగన్వాడీ సూపర్వైజర్ మల్లీశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరుమాళ్ళపల్లె విద్యార్థులకు బంగారు పతకం



ప్రజాశక్తి- సోమల: తిరుపతి రూరల్ పెరుమాళ్ళ పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్బాల్ పోటీలలో అత్యంత ఆట తీరును ప్రదర్శించి బంగారు పతకాన్ని సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి తెలిపారు. తిరుపతి మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోటీలలో ఈనెల 23వ తేదీ నిర్వహించిన బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలలో పెరుమాళ్ళ పల్లె ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న జగదీష్ ఫారుక్ ఇద్దరు విద్యార్థులు ఆటలో అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి బంగారు పథకాన్ని సాధించారు. రాష్ట్రస్థాయిలో తమ క్రీడా ప్రతిభను చూపి మొదటి స్థానంలో నిలిచి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగరాణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పుంగనూరు జోనల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సోమల: పుంగనూరు జోనల్ గేమ్స్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాల సోమల విద్యార్థులు బాల్ బాడ్మింటన్ గేమ్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. ఈనెల 23వ తేది జెడ్పీ ఉన్నత పాఠశాల పెద్ద మల్లెలలో పుంగనూరు జోన్ పాఠశాలల బాలురు, బాలికల బాల్ బ్యాండ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పుంగనూరు జోన్ పరిధిలోని వివిధ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో సోమల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పీడీ కరుణానిధి తెలిపారు. ఈ విజయం పట్ల హెచ్‌ఎం హరినాథ్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసి క్రీడాకారుల్ని అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుష్ప పల్లకిలో ఊరేగిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి



ప్రజాశక్తి-సోమల: మండలం నెల్లిమంద పంచాయతీ బురుజు పల్లి గ్రామంలో వెలసిన శ్రీ భూదేవి శ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి అష్టమ వార్షిక కళ్యాణ మహోత్సవం కార్యక్రమాలలో భాగంగా సోమవారం రాత్రి 10 గంటల నుండి గ్రామపురవీధులలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పుష్ప పల్లకిలో ఊరేగించారు. స్వామివారి కల్యాణోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి సాయంత్రం పుష్ప పల్లకిలో పురవీధులలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించగా భక్తులు కర్పూర హారతులతో స్వామివారికి స్వాగతం పలికి కొబ్బరికాయలను కొట్టి తమ మొక్కులను తీర్చుకున్నారు.

వెండి కిరీటం విరాళం.

శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి మూలవిరాట్ విగ్రహానికి గ్రామానికి చెందిన గల్లా నాగరత్నమ్మ సుధాకర్ నాయుడు దంపతులు ఒక లక్ష 25 వేల రూపాయల విలువ చేసే వెండి కిరీటాన్ని స్వామివారికి విరాళంగా అందజేశారు. తమ ఇంటి వద్ద నుండి కిరీటాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలోని మూలవిరాట్‌కు అర్చకుల ద్వారా అలంకరించారు. కాగా స్వామి వారి అష్టమ వార్షిక కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆరుతడి పంటలపై మొగ్గు చూపాలి

జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ



ప్రజాశక్తి గంగవరం : రబీ సీజన్లో రైతులు పూర్తిగా వరి పంటపై ఆధారపడకుండా ఆరు తడి పంటలపై మగ్గుచూపాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీ కృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని కీళ్లపట్ల పంచాయతీ కొత్తపల్లి పరిసర గ్రామాలలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు స్థానిక ఆర్‌బికె కేంద్రాలలో తమ భూములను భూమిపరీక్ష చేయించి వాటికి కావలసిన ఎరువులు వాడకం, వాటిలో ఏ పంటలు పండిస్తే లాభదాయక ఉంటుందన్న విషయాలు తెలుస్తాయని అన్నారు. ఎక్కువగా ఆరుతడి పంటలపైనే రైతులు మొగ్గు చూపాలన్నారు. పంట బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, వరి పంటకు ఎకరాకు రూ.84లు చొప్పున ప్రియం చెల్లిస్తే నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.42000లు తెలుస్తుందని, అలాగే వేరుశనగ పంటకు రూ.60లు ప్రీమియం చెల్లిస్తే ఎకరాకు రూ.30 వేలు చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు శివకుమార్, మండల వ్యవసాయ అధికారిని హేమలత, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'ఆదాని అవినీతి కుంభకోణాన్ని పార్లమెంటులో నిగ్గు తేల్చండి'

ప్రజాశక్తి-పలమనేరు: ఆదాని అవినీతి కుంభకోణాన్ని పార్లమెంటులో నిలదీసి నిగ్గు తేల్చండని ప్రతిపక్ష ఎంపీలకు జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డివి మునిరత్నం విజ్ఞప్తి చేశారు. మంగళవారం పట్టణంలో జాతీయ మానవ హక్కుల కార్యాలయంలో మణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశంలోని ప్రజల రక్తాన్ని రాబందుల్లాగా పీల్చుకొని అక్రమంగా సంపాదించిన కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని అమెరికా దేశంలో ఉన్న కాంట్రాక్ట్ పనుల కోసం అక్కడ అధికారులకు లంచాలుగా ఇస్తూ పట్టుబడిన ఆదానిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో అవినీతి పెరిగిపోవడానికి ఆదాని కుంభకోణమే నిదర్శనమని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాగార్జున, ఆనంద్, శ్రీనివాసులు, దేవరాజులు, గంగిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.



రైతు సేవా కేంద్రం.. కమ్యూనిటీ హాల్‌కు మార్పు



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: కలిజవేడు పంచాయతీలో నిర్వహిస్తున్న రైతు సేవా కేంద్రాన్ని అదే పంచాయతీలోని కేనాసంపల్లిలోని కమ్యూనిటీ హాల్‌కు మార్చేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని సర్పంచ్ నీలావతి, ఉప సర్పంచ్ రామమూర్తి రెడ్డిలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ గతంలో ఈ రైతు సేవ కేంద్రం అద్దె భవనంలో నడుస్తుండేదని ప్రజల కోరిక మేరకు ఈ మార్పును చేపట్టామన్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న రైతు సేవా కేంద్రాన్ని సర్పంచ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్లో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'మాధవరంలో పొలం పిలుస్తోంది'



ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని మాధవరం, బోయపల్లిలో సోమవారం వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరిలో నారుమడి, యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, కాలిబాట తీయడం వలన ప్రయోజనాలను వివరించారు. అలాగే సేంద్రియ ఎరువుల వలన ఉపయోగం, రసాయన ఎరువుల జరిగే నష్టాన్ని తెలిజేశారు. పట్టు పరిశ్రమశాఖ అధికారి ఆరుముగం మాట్లాడుతూ వారి శాఖలో అమలవుతున్న పథకాలు, రాయితీలు గురించి వివరించారు. మార్కెటింగ్ శాఖ నుండి రామమూర్తి, రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడల్లో చౌడేపల్లి విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి- చౌడేపల్లి: పుంగనూరు జోన్ క్రీడల్లో భాగంగా రెండో రోజు చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన సీనియర్ బాయ్స్ వాలీబాల్‌లో చౌడేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, కందూరు విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించడం జరిగింది. అలాగే జూనియర్ బాయ్స్ కబడ్డీ విభాగంలోచౌడేపల్లి విద్యార్థుల ప్రథమ స్థానం, పుదుపట్ల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. సీనియర్ గర్ల్స్ కబడ్డీ విభాగంలో పుదుపట్ల విద్యార్థులు ప్రథమ స్థానం, చౌడేపల్లి విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించడం జరిగింది.